సాక్షి
వరంగల్
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండాలి - 8లో▸
అర్చకులు గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండాలని దేవాదాయశాఖ వరంగల్ జోన్ ఉపకమిషనర్ శ్రీకాంతారావు తెలిపారు.



కేయూలో బంద్ ప్రశాంతం
విద్యార్థి జేఏసీ ఇచ్చిన కేయూ బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. వీసీ రమేశ్‌ను బర్తరఫ్ చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$34^0/21^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం కొంత వేడిగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

కోడ్ వచ్చేస్తోంది..?

వారంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

- బీఆర్ఎస్ నేతలకు అధిష్టానం సంకేతాలు
- హడావుడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఇక అగ్రనేతల పర్యటనలు.. 6న మంత్రి కేటీఆర్
- ఎన్నికల ఏర్పాట్లపై అధికారులు అప్రమత్తం

సాక్షిప్రతినిధి, వరంగల్:

‘అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఈనెలలో వస్తుందంటారా? జమిలీ ఎన్నికలపై నిపుణుల కమిటీ ఏం తేలుస్తోంది. ఇప్పట్లో అది సాధ్యం కాదట కదా..! షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగకపోతే కేంద్ర ఎన్నికల కమిషన్ మంగళవారం హైదరాబాద్‌కు ఎందుకు వస్తుంది. కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో కూడా భేటీ అవుతుంది కదా.. త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందట కదా? అలాగైతే షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయన్నమాట’ ఎక్కడ నలుగురు కలిసినా.. ఇదే చర్చ. ఇంతకీ ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ ఎప్పుడొస్తాయనే విషయమై ఇంకా స్పష్టత రానప్పటికీ.. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయన్న సంకేతాలు మాత్రం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అధిష్టానం నుంచి అందినట్లు ప్రచారం జరుగుతోంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సారథ్యంలో 17 మంది సభ్యుల బృందం మంగళవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చేరుకోవడం కూడా ప్రచారానికి బలం చేకూరుస్తోంది. దీంతో సర్వత్రా



ఎన్నికల షెడ్యూల్‌పైనే చర్చ జరుగుతోంది.

సర్వసన్నద్ధంగా అధికార యంత్రాంగం..

గత పోలింగ్ 2018 డిసెంబర్ 7న జరిగింది. ఇందుకోసం నవంబర్ 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని అక్టోబర్ 23న ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. 2023 డిసెంబర్ 13న ప్రభుత్వం రద్దయ్యే అవకాశం ఉన్నందున ఆలోగా.. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వీలుగా ఈసారి కూడా ఎన్నికల షెడ్యూల్ ఉంటుందన్న చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో.. కేంద్ర ఎన్నికల కమిషన్ మంగళవారం రాష్ట్రానికి చేరుకుంది. రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లాల ఉన్నతాధికారులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించనుండడం షెడ్యూల్ ప్రకారమే.. ఎన్నికలు అనే వాదనకు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా.. ఇప్పటికిప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా.. ఎన్నికలు జరిపేలా ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారుగా 27.89 లక్షల పైచిలుకు ఓటర్ల కోసం 3,252 పోలింగ్ కేంద్రాలు, 5,890ల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) సిద్ధం చేసినట్లు కూడా ప్రకటించారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాల మార్కింగ్ చేశారు. జిల్లా కలెక్టరేట్లలో ఎన్నికల కేంద్రాలు, మీడియా సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈఏర్పాట్లతో పాటు ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన విధానాలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేర కు ఉమ్మడి వరంగల్‌కు చెందిన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లారు.

దూకుడు పెంచిన ప్రజాప్రతినిధులు, పార్టీలు

కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో కాలు మోపడంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. ఉమ్మడి వరంగల్‌లో అధికార బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు దూకుడు పెంచారు. ఏ క్షణంలోనైనా ఎన్నికల కోడ్ అమల్లోకి రావొచ్చన్న సంకేతాలతో ఓ అడుగు ముందుకేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు పెట్టుకుంటున్నారు. దీంతో మంత్రులతోపాటు ముఖ్యమంత్రి సహా అగ్రనేతల పర్యటనలతో జిల్లా హోరెత్తనుంది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈనెల 6న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ గ్రేటర్ వరంగల్‌లో పర్యటించనున్నారు. హరీశ్, కేసీఆర్ కార్యక్రమాలు కూడా ఉమ్మడి జిల్లాలో ఉండనున్నాయి. అలాగే నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల పర్యటనలు, కార్యక్రమాలను మంగళవారం నుంచి మరింత ముమ్మరం చేశారు. ఇప్పటికే దరఖాస్తులు చేసుకుని టికెట్ల కోసం ఎదురుచూస్తున్న ఆ రెండు పా ర్టీల అభ్యర్థుల జాబి తా కూడా త్వ రలోనే వెలువడనుందన్న ధీమాను పార్టీల నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా కేంద్ర ఎన్నికల కమిషన్ ముూడ్రోజుల పర్యటన అన్ని రాజకీయ పార్టీల్లో వేడిని పెంచింది.

అరూరిపై ఆగ్రహ జ్వాల

- సంక్షేమ పథకాలు మాకెందుకులేవని నిలదీత
- దమ్మన్నపేటలో ప్రజల ఆందోళనతో ఉక్కిరిబిక్కిరి
- ఇప్పటికే ఎమ్మెల్యే చల్లాకు నిరసన సెగలు
- వర్ధన్నపేట, పరకాల బీఆర్ఎస్‌కు కంచుకోట
- ఊహించని పరిణామాలతో పార్టీలో అంతర్మథనం

సాక్షి, వరంగల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ నియోజకవర్గాలకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నిరసన సెగలు తగులుతున్నాయి. సంక్షేమ పథకాలు మాకు ఎందుకు ఇవ్వడంలేదని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని పరకాల నియోజకవర్గంలోని ప్రజలు ఇటీవల నిలదీశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు మంగళవారం ఆ అనుభవం ఎదురైంది. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రా రంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం వెళ్లిన ఆయనను ప్రజలు అడ్డుకున్నారు. ‘దళిత బంధుకు అర్హత ఉన్న వాళ్లను కాకుండా వారి అనుయాయులకు ఇచ్చుకున్నారు. గృహలక్ష్మి పథకానికి కూడా అర్హత ఉన్న వారిని పరిగణనలోకి తీసుకోకుండా ఎమ్మెల్యే ఫైనల్ చేసిన జాబి తా వారికే ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి తాజాగా మళ్లీ ఇతరులకు కేటాయించడం ఎంతవరకు సమంజసమని’ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు వినిపించుకోలేదు. ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో స్వల్ప తోపులాట జరిగింది. అప్పటికే బందోబస్తు ఉన్న పోలీసుల సాయంతో ఆ గ్రామంలోకి వెళ్లి అభివృద్ధి పనులు ప్రారంభించి అరూరి రమేశ్ వెళ్లిపోయారు.

ఇన్నిరోజులు పార్టీ నేతలు.. ఇప్పుడు ప్రజలు

నియోజకవర్గంలో ఇన్ని రోజులు వర్ధన్నపేట



నిరసన తెలుపుతున్న ప్రజలు

ఎమ్మెల్యే అరూరి రమేశ్‌పై బీఆర్ఎస్‌లోని ముఖ్యనేతలే అసంతృప్తి వెళ్లగక్కారు. ఆయనకు టికెట్ ఇస్తే పనిచేయమనే వరకు వెళ్లారు. అరూరి వద్ద పార్టీ నేతలకు అసలు గౌరవం లేదని, అలాంటి వ్యక్తికి మేం ఎలా మద్దతిస్తామని ఓ పది రోజుల పాటు ముఖ్యనేతల వద్ద సమావేశాలు కూడా జరిగాయి. చివరకు బీఆర్ఎస్ పెద్దల నుంచి వచ్చిన ఆదేశాలతో అసమ్మతి సమసిపోయింది.. పరిస్థితి అంతా చక్కదిద్దుకుందన్న తరుణంలో ఎవరు ఊహించని రీతిలో అరూరికి ప్రజల నుంచి నిరసన సెగ తగలడం పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇప్పటికే గుబ్బెడ తండా, చెన్నారంలో ప్రజల నుంచి నిరసనలు వచ్చాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దళితబంధు, గృహలక్ష్మి తదితర పథకాలు తమకు ఎందుకు రావడం లేదని దమ్మన్నపేట గ్రామస్తులు అడిగే ప్రశ్నలకు సమాధానం కరువవుతోంది. ఈసారి లక్ష మెజారిటీతో గెలవడం పక్కా అనుకున్న ఈ స్థానంలో ప్రజల నుంచి ఊహించని వ్యతిరేకత రావడం వర్ధన్నపేటలో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని ఆ నియోజకవర్గ ముఖ్యనేత వ్యాఖ్యానించారు. అరూరికి ఎదురు లేదని అనుకుంటున్నాడు కానీ తప్పక ఎదురీత ఈదాల్సిన పరిస్థితి ఉందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ నేత తెలిపారు. ఓవైపు పార్టీలో అంతర్గత పోరు, ఇంకోవైపు ప్రజల నిరసన సెగ.. వీటి నుంచి అరూరి తప్పించుకుని ఎలా బయటపడుతాడోనని ఆయన అభిమానుల్లో ఆందోళన మొదలైందని నియోజకవర్గంలో భారీగా చర్చ జరుగుతోంది. అలాగే, పరకాలలో వార్ వన్ సైడ్ ఉందనుకుంటే అక్కడ కూడా ప్రజల నుంచి నిరసనలు రావడం ఎమ్మెల్యే చల్లాకు నిద్ర పట్టనివ్వడం లేదని ఆ పార్టీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారు.

న్యూస్‌రీల్

పాకాల వాగుపై వంతెనకు నేడు శంకుస్థాపన



చెన్నారావుపేట: పాకాల(మున్నేరు) వాగుపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.18.70 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఖానాపురం, చెన్నారావుపేట మండలాల ప్రజలు, రైతుల రాకపోకలకు సులభం కానుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ కంది కృష్ణారెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాకాలవాగుపై వంతెన, చెక్ డ్యాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు పంట నష్టపరిహారం చెక్కులను కూడా రైతు వేదికలో పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ తూటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, మురహరి రవి, బాల్నె వెంకన్న, సర్పంచ్ కుండె మల్లయ్య, కొండవీటి ప్రదీప్‌కుమార్, ఎంపీటీసీ ధారావత్ శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



ఖానాపురం: విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సారయ్య అన్నారు. బుధరావుపేట హైస్కూల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి విద్యాసామర్థ్యాల పరీక్షల పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలు విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు, అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడేందుకు దోహదపడతాయన్నారు. విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. లక్ష్యంతో చదువుకుంటే గమ్యాన్ని చేరుకోవచ్చన్నారు. అనంతరం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతున్న ఉన్నతి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంఈఓ రత్నమాల, ఎంఎన్ఓ చరణ్‌సింగ్, హెచ్‌ఎం ఆరిఫ్ హుస్సేన్, సీఓ శశిధర్, సీఆర్పీ భాస్కర్, ఉపాధ్యాయులు శ్రీధర్, యాకయ్య పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



కరీమాబాద్: వరంగల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల ప్రవర్తన, నియమావళి, సీఎంసీలపై మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మంగళవారం అవగాహన కల్పించారు. ఎన్నికల సందర్భంగా మీడియా మానిటరింగ్, సార్వత్రిక ఎన్నికల సమయంలో సోషల్ మీడియా, ఈ–పేపర్లు, కేబుల్ నెట్‌వర్క్, టీవీ, రేడియో చానల్స్ గురించి వివరించారు. జిల్లా ఎన్నికల నోడల్ అధికారి, పశుసంవర్ధక శాఖ జేడీ బాలకృష్ణ, మీడియా మానిటరింగ్ సెల్ నోడల్ అధికారి, డీపీఆర్ఓ అయూబ్‌అలీ, ఆర్డీఓ వాసుచంద్ర, ఎంసీఎంసీ సభ్యులు కృష్ణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాజ్‌కుమార్, ఈ డిస్ట్రిక్ మేనేజర్, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్, మెండు రవీందర్‌పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై సమీక్ష



కరీమాబాద్: వరంగల్ జిల్లాలోని హెచ్‌బీసీ, బీపీసీ, ఐఓసీల సేల్స్ మేనేజర్లతో మంగళవారం జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. రోజు వారీగా, నెల వారీగా అమ్మకాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకుల్లో సంబంధిత లైసెన్స్, స్టాక్, ధరల పట్టిక, నో స్మోకింగ్ సైన్ బోర్డులు, ఎంట్రీ, ఎగ్జిట్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బంకులకు వచ్చే వినియోగదారులకు తాగునీరు, టాయిలెట్స్, ఎయిర్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి




వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ గోపాల్, ఆస్పత్రిలో వార్డును పరిశీలిస్తూ..

- పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి
- డీసీహెచ్ఎస్ డాక్టర్ గోపాల్

వర్ధన్నపేట: పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ గోపాల్ వైద్యులను ఆదేశించారు. సమయపాలన పాటించాలని, విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. వర్ధన్నపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగాన్ని తొలుత సందర్శించి హాజరు పట్టికను పరిశీలించారు. ఓపీలో వైద్యులు విధులకు హాజరయ్యారా అని అడిగి తెలుసుకున్నారు. హౌస్‌సర్జన్లు, వైద్య నిపుణులు ఓపీ విధులు నిర్వర్తించారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి తెలిపారు. అనంతరం ల్యాబ్స్, ఫార్మసీ, ఎక్స్‌రే, ఏఎన్‌సీ విభాగాలను, బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. భవనంపై నూతనంగా నిర్మించిన 30 పడకల ఐసీయూ, ఆపరేషన్ థియటర్, 3 వార్డులను పరిశీలించారు. పోస్ట్ ఆఫ్ వార్డు, ప్రసవ ఆపరేషన్ థియటర్‌ను సందర్శించారు. వార్డుల్లో ఉన్న రోగులతో ఆయన మాట్లాడి వైద్య సేవలు బాగా అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆస్పత్రి ఆవరణలోని చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అదేవిధంగా ఆస్పత్రిలో హాజరు వేసుకుని సొంత ప్రాక్టీస్ చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రి సేవలపై నమ్మకం కలిగేలా ప్రతిఒక్కరు పనిచేయాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ మానస, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ

నల్లబెల్లి: మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని నిహారిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై నర్సంపేట ఏసీపీ తిరుమల్ మంగళవారం విచారణ చేశారు. పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా మాట్లాడారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను తెలుసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని తోటి విద్యార్థినులతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. తోటి విద్యార్థినులను దూషిస్తే, అవమానిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏసీపీ వెంట నర్సంపేట రూరల్ సీఐ పుల్యాల కిషన్, తహసీల్దార్ రాజేశ్, ఎస్సై నైనాల కిషన్ తదితరులు ఉన్నారు.



గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విచారణ చేస్తున్న ఏసీపీ తిరుమల్

మహనీయుల విగ్రహాలను పునఃప్రతిష్ఠించాలి



దీక్షలో కూర్చున్న డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట: వర్ధన్నపేటలో తొలగించిన మహనీయుల విగ్రహాలను వెంటనే పునఃప్రతిష్ఠించాలని డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అంబేద్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జక్కి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వరకు వెళ్లి ధర్నా చేశారు. కమిషనర్ జోనాకు వినతిపత్రం అందజేశారు. కమిషనర్ స్పందిస్తూ రెండు రోజుల్లో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు గద్దెలు నిర్మిస్తామని, స్థలం ఎంపిక చేయాలని కోరారు. వర్ధన్నపేట–జఫర్‌గడ్ ప్రధాన రహదారి డివైడర్ వద్ద నెహ్రూ, సమీకృత మార్కెట్ సమీపంలో మహాత్మా గాంధీ, వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేయాలని వారు ఆయనకు సూచించారు. జోనా స్పందిస్తూ వెంటనే స్థలాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జున్ను పరంజ్యోతి, చిదరాల కుమారస్వామి, సమ్మెట సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో విద్యార్థులకు పతకాలు

నెక్కొండ: పలు క్రీడాపోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. జాతీయస్థాయి ఖోఖో ఖేల్ ఇండియా లీగ్ పోటీలకు సూరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మూడు జానకి ఎంపికైందని హెచ్‌ఎం బత్తుల పరమేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఆయన మాట్లాడారు. గత నెల 24న నాగర్‌కర్నూల్‌లో జరిగిన ఖేల్ ఇండియా సబ్ జూనియర్ ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో జానకి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో తమిళనాడులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని పేర్కొన్నారు. అనంతరం జానకిని సర్పంచ్ సింగారపు గీత, ఎంపీటీసీ మాదాసు శారద, ఎస్ఎంసీ చైర్మన్ పరకాల వెంకటమల్లు అభినందించారు. పీఈటీ కోట రాంబాబు, ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్, రవీందర్, జోగయ్య, రమేశ్, సారంగపాణి, శాంతవతి, నర్సింగరావు, అన్నపూర్ణ, బాబు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



నెక్కొండ : విద్యార్థి జానకిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి క్రీడల్లో మైనార్టీ పాఠశాల విద్యార్థినుల విజయం..

నర్సంపేట: వరంగల్‌లో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు జరిగిన జిల్లాస్థాయి జోష్ స్పోర్ట్స్‌లో నర్సంపేట మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థినులు విజయం సాధించారు. గ్రూప్ ఈవెంట్స్‌లో చాంపియన్‌షిప్ కైవసం చేసుకొని ప్రభంజనం సృష్టించారని నర్సంపేట మైనార్టీ పాఠశాల, కళాశాల



నర్సంపేట : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రిన్సిపాల్ చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ పాఠశాల నుంచి 57 మంది క్రీడాకారులు పాల్గొని విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే, రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువాలని కోరారు. అనంతరం విద్యార్థినులను ఆర్ఎల్‌సీ శ్రీపాల, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చెన్నారావుపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో నీరు నిల్వకుండా చూడాలని, దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్‌బాల్స్ వేయాలని, టైర్లు, చెత్త కుండీలు వాడకంలో లేని వస్తువులను వెంటనే బయటకు తరలించాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, తాగునీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. సబ్ యూనిట్ అధికారి నంద, హెల్త్ సూపర్‌వైజర్ రామెల్, సిబ్బంది శివాజీ, సారియ, సురేందర్, పుష్ప, హెచ్‌ఎం కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

నర్సంపేట: రైతు వ్యతిరేక చట్టాల రద్దు సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొరబోయిన కుమారస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అక్కపల్లి రమేశ్, న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకుడు నాగెల్లి కొమురయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం వామపక్ష రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వృత్తి సంఘాల జిల్లా నాయకుడు ముంజాల సాయిలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతగిరి రవి, నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, ఫరీదా, విజయ, నాగమణి, అనిల్, ఎస్.బాబు, విలియం, లక్ష్మి, ఏఐటీయూసీ నాయకులు మునేశ్వర్, ఎం.గోవర్ధన్, సతీష్, ఏఐకేఎంఎస్ నాయకులు జి.కృష్ణ, గుర్రం అజయ్, ఆకుల వెంకటస్వామి, బోగి సారంగపాణి, దండు చిన్నసారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వృద్ధిలో పోటీపడాలి

చెన్నారావుపేట: ఆదాయ వృద్ధిలో మహిళలు పోటీపడాలని సెర్ప్ ప్రాజెక్టు రాష్ట్ర మేనేజర్ కె వీరమల్లు సూచించారు. మండలంలోని ఆశాజ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో చెన్నారావుపేట, తిమ్మరాయినిపహాడ్ గ్రామాల్లో ఆర్థికాభివృద్ధి యూనిట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం వీరమల్లు మాట్లాడుతూ మహిళలు తీసుకున్న ప్రతి అప్పు ఆదాయానికి మార్గం కావాలన్నారు. ప్రాజెక్టు లక్ష్యాన్ని మహిళలు పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. రుణాలతో మహిళలు సాధిస్తున్న విజయాలను చూడడానికి రాష్ట్రవ్యాప్తంగా పోర్టల్‌లో నమోదు చేసిన యూనిట్లలో కొన్నింటిని పరిశీలించినట్లు తెలిపారు. మహిళలు లక్ష్యాలను సాధించడంలో చెన్నారావుపేట టీం ఆదర్శవంతంగా పనిచేస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ గొట్ట శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ భవాని, మండల ప్రాజెక్టు మేనేజర్ ఈశ్వర్, సీసీలు కట్టయ్య, మంజుల, వీఓలు ఆమని, కోమల, సుధ, మంజుల, జ్యోతి, గ్రామ సంఘాల ప్రతినిధులు, సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



తిమ్మరాయినిపహాడ్‌లో గేదెలను పరిశీలిస్తున్న ప్రాజెక్టు రాష్ట్ర మేనేజర్ వీరమల్లు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నెక్కొండ: గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ (సీఐటీయూ అనుబంధం) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు, కార్మికుల 34 రోజులు సమ్మె చేశామని గుర్తు చేశారు. సమ్మెతో ప్రభుత్వం దిగివచ్చి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆయన ఆరోపించారు. దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5న చలో హైదరాబాద్‌కు యూనియన్ పిలుపు నిచ్చిందని వెంకటయ్య పేర్కొన్నారు. సంఘం మండల అధ్యక్షుడు భూక్య నరేష్, ప్రధాన కార్యదర్శి వీరస్వామి, కార్మికులు శ్రీను, మదార్, సూరమ్మ, కృష్ణ, ప్రవీణ్, రామనర్సమ్మ, నగేస్, రాజు, సుజాత, స్వరూప, రాధిక, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తే కుటుంబ పాలన : బీజేపీ

నర్సంపేట రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తే అవినీతి, కుటుంబ పాలన, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే స్కాంల పాలన వస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీకి మద్దతు పలకాలని కోరారు. రామవరం గ్రామానికి చెందిన జినుకుల హరికృష్ణ, భూసాని సాంబయ్య, జినుకల కమలాకర్, బల్లాల మోహన్, జినుకల రాజు ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి రేవూరి ప్రకాశ్‌రెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు దూపటి ఆనంద్, నాయకులు నల్లబెల్లి సుదర్శన్, కట్కూరి దామోదర్ రెడ్డి, భూసాని సుదర్శన్, బండారి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యం..

- ప్రైవేట్ హెల్పర్‌కు కరెంట్ షాక్.. తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన కిరణ్

రఘునాథపల్లి: విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రైవేట్ హెల్పర్‌కు కరెంట్ షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కంచనపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మంగళవారం సాయంత్రం విద్యుత్ లైన్‌మెన్ సోమయ్య స్థానిక సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న జేఎల్‌ఎం వీరస్వామికి సమాచారం ఇచ్చి ఎల్‌సీ తీసుకుని గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేయిస్తున్నాడు. ప్రైవేట్ హెల్పర్ భాస్కుల్ కిరణ్‌తో బీసీ కాలనీలో పనులు చేయిస్తున్నారు. అయితే పని పూర్తికాకముందే సబ్‌స్టేషన్‌లోని జేఎల్‌ఎం లైన్‌ఆన్ చేయడంతో కిరణ్ కరెంట్ షాక్‌కు గురై తీగలపైనే తలకిందులై తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు గుర్తించి సబ్‌స్టేషన్‌కు సమాచారమిచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. తీవ్ర గాయాలైన కిరణ్‌ను కిందకు దింపి హుటాహుటిన జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించారు. లైన్‌మెన్, జేఎల్‌ఎం నిర్లక్ష్యంపై స్థానికులు సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఘటనపై ఏఈ రాహుల్‌ను వివరణ కోరగా ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రమేష్(ఫైల్)

దామెర: అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో జరిగింది. గ్రామానికి చెందిన వంగ రమేష్(35) తన కున్న ఎకరన్నర భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ సంవత్సరం పత్తిపంట సాగు కోసం, తన ఇద్దరి పిల్లల చదువు కోసం రూ.3 లక్షల 50 వేలు అప్పు చేశాడు. అయితే అప్పుకు వడ్డీ చెల్లించలేక, అప్పు తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం తన వ్యవసాయబావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు!

- కేయూ విద్యార్థి జేఏసీ నాయకుల ఆరోపణ
- లిఖితపూర్వకంగా పోలీస్ కమిషనర్ దృష్టికి..
- మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో పెట్టాలని డిమాండ్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల రెండో కేటగిరీలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రధానంగా వివిధ విభాగాల్లో పార్ట్‌టైం అభ్యర్థులకే ఎక్కువ సీట్లు ఇచ్చారని, రెగ్యులర్ అభ్యర్థులకు తక్కువ ఇచ్చారని విద్యార్థి జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఏదేని విభాగంలో 25 శాతం పార్ట్‌టైం, 75 శాతం ఫుల్‌టైం అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని అధికారులు బేఖాతర్ చేసినట్లు ఆరోపిస్తున్నారు. న్యాయ విచారణ జరిపించాలని కూడా కేయూ దూరవిద్య కేంద్ర ఆవరణలో నిరాహార దీక్షలు కొనసాగిస్తున్న విషయం విదితమే.

పోలీస్ కమిషనర్ దృష్టికి..

ఇటీవల విద్యార్థి జేఏసీ నాయకులతో సీపీ రంగనాథ్ సమావేశం నిర్వహించారు. ఇందులో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు సీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఆరోపణలను లిఖితపూర్వకంగా రాసిస్తే వీసీ దృష్టికి తీసుకెళ్తానని సీపీ విద్యార్థి నాయకులకు సూచించారు. దీంతో పలు అంశాలను విద్యార్థి జేఏసీ నాయకులు కొన్ని పేజీల రిపోర్టులు సమర్పించారని సమాచారం. అందులో కొన్ని అంశాలను ఆరు రోజుల క్రితం కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్ వెల్లడించారు. ఆ వివరాలు ఇవీ..

ఇష్టానుసారంగా..

పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో వీసీ తన ఇష్టానుసారంగా కొందరికి అడ్మిషన్లు వచ్చేలా వ్యవహరించారని, యూజీసీ నిబంధనలు మార్చుకుని డీఆర్‌సీని కాదని, ఒక కొత్త అడ్మిషన్ కమిటీని ఇంటర్వ్యూ కోసం వివిధ విభాగాలను తయారు చేసి, తాను ఆమోదించిన ఆ కమిటీలతో ఇంటర్వ్యూలు నిర్వహించారని సీపీకి అందించిన లేఖలో పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధం..

కంప్యూటర్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో ఇంటర్వ్యూల్లో ఆ విభాగపు సూపర్‌వైజర్‌ను ఇంటర్నల్ ఎక్స్‌పర్ట్ కింద ఉంచలేదు. వేరే విభాగపు సూపర్‌వైజర్‌ను కమిటీలో ఉంచడం నిబంధనలకు విరుద్ధం. అంతేకాకుండా ఇద్దరూ వేరే యూనివర్సిటీ వాళ్లను ఎక్స్‌టర్నల్ ఎక్స్‌పర్ట్‌లుగా నియమించారు. మెరిట్ విద్యార్థులకు సీట్లు రాకుండా నష్టం చేశారని, పలు విభాగాల అడ్మిషన్ కమిటీ ఆర్డర్‌లను బయట పెడితే నిజాలు బయటపడతాయని, ఈ కమిటీ ఆర్డర్లను యూనివర్సిటీ గోప్యంగా ఉంచడంలో ఆంతర్యమేంటని లేఖలో ప్రశ్నించారు.

ఈడబ్ల్యూఎస్ కోటా ఎలా వచ్చింది?

అభ్యర్థులు అప్లికేషన్ నింపేటప్పుడు లేని ఈడబ్ల్యూఎస్ కోటా ఇంటర్వ్యూలో ఎలా రప్పించారని సీపీకి అందించిన లేఖలో విద్యార్థులు ప్రశ్నించారు. బయోటెక్నాలజీ విభాగంలో, బీసీ కేటగిరీ కింద ఓ మహిళా అభ్యర్థికి 51, మరో మహిళకు 46, మరొకరికి 44 మార్కులు వచ్చాయి. వీరిలో ఎవ్వరినీ ఎంపిక చేయకుండా 43 మార్కులు ఉన్న మరో మహిళా అభ్యర్థిని ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో బీసీ–బీ కేటగిరీ కింద 65 మార్కులతో రెండో టాపర్ ఏ మహిళా అభ్యర్థిని కాదని, 52 మార్కులతో పురుష అభ్యర్థిని ఎంపిక చేశారని లేఖలో నిలదీశారు. ఇంకా పలు అంశాలను సీపీకి అందించిన లేఖలో పేర్కొన్నట్లు, ప్రవేశ పరీక్ష మార్కులు, ఇంటర్వ్యూ మార్కుల మెరిట్ జాబితాను పేర్లతో సహా.. వెబ్ సైట్‌లో పొందుపర్చాలని కోరినట్లు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్ తెలిపారు.

కేయూలో బంద్ ప్రశాంతం..

- పరిపాలనాభవనం వద్ద విద్యార్థుల ధర్నా
- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం


పరిపాలనా భవనం వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ టి శ్రీనివాస్‌రావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి జేఏసీ ఇచ్చిన కాకతీయ యూనివర్సిటీ బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు క్యాంపస్‌లోని వివిధ కళాశాలలు, విభాగాలు తిరుగుతూ తరగతి గదుల్లోని విద్యార్థులను బయటకు పంపారు. అలాగే, ఉద్యోగులను కూడా పంపారు. దీంతో కేయూలో పాలన స్తంభించింది. అనంతరం వివిధ విభాగాల విద్యార్థులతో కలిసి ర్యాలీగా పరిపాలనాభవనం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై ప్రశ్నించిన విద్యార్థులను పోలీసులతో కొట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై తాము 46 పేజీల బుక్‌లెట్ విడుదల చేశామన్నారు. ఇప్పటికే పలు అంశాలను వరంగల్ పోలీస్‌కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. వాటిపై వీసీ, రిజిస్ట్రార్లు బహిరంగ చర్చకు రావడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ తిరుపతి యాదవ్, నేతలు మందవీరస్వామి, రంజిత్‌కుమార్, రాంబాబు, మనోహర్, నాగరాజు, శంకర్, పాషా, రాజేష్, ప్రశాంత్, జగన్, రమేష్, విజయ్, రాజునాయక్, ప్రసాద్, సాయిరాం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలను ఉధృతం చేయాలి

- ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఓంకార్


మాట్లాడుతున్న అశోక్

వరంగల్ చౌరస్తా : వర్గ, సామాజిక, జమిలి పోరాటాలను ఉధృతం చేయడమే అమరులకు ఇచ్చే ఘన నివాళి అని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం దివంగత పరికరాల భూమయ్య, పిట్ట వెంకటయ్య, సింగిరెడ్డి కొంరయ్య సంస్మరణ సభ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన వరంగల్ శివనగర్‌లోని ఓంకార్ భవన్‌లో జరిగింది. ఈ సంస్మరణ సభకు అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరికరాల భూమయ్య ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకుడిగా, నేరేడుపల్లి ఎంపీటీసీగా పని చేశారన్నారు. చనిపోయే వరకు నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడిన వ్యక్తి భూమయ్య అన్నారు. కార్మిక నాయకుడిగా పిట్ట వెంకటయ్య, రైతు ఉద్యమ నాయకుడిగా సింగిరెడ్డి కొంరయ్య సేవలు మరవలేనిన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, సుకన్య, గోనె కుమారస్వామి, ఎన్ రెడ్డి హంసా రెడ్డి, తుకారాం నాయక్, మంద రవి, గడ్డం నాగార్జునా, నర్ర ప్రతాప్, జబ్బార్ నాయక్, శ్రీనివాస్, వంగల రాగసుధ, నీల రవీందర్, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, కుసుంబ బాపురావు, గుండెబోయిన చంద్రయ్య, నాగెల్లి కొమరయ్య, గాదె మల్లేష్ ,కంచ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సై అంటే.. సై



పతకాలు సాధించిన క్రీడాకారులతో విద్యుత్ శాఖ అధికారులు

- హోరాహోరీగా విద్యుత్ ఉద్యోగుల క్రీడలు
- తమిళనాడు అథ్లెట్ల హవా
- మొదటిరోజు పోటీలు ఉత్కంఠ

హన్మకొండ: ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ కోసం విద్యుత్ ఉద్యోగుల మధ్య పోరు హోరాహోరీగా కొనసాగుతోంది. తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభమైన క్రీడా పోటీలు మంగళవారం ఉత్కంఠగా కొనసాగాయి. టీఎస్ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్‌డీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మొదటి రోజు విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. 200, 800 మీటర్ల రన్నింగ్, హ్యామర్‌త్రో, షాట్‌పుట్, 400 మీటర్ల హర్డిల్స్, లాంగ్‌జంప్‌తో పాటు బాల్‌బ్యాడ్మింటన్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు తలపడ్డారు. తమిళనాడు క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో దూసుకుపోతూ గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి ముందంజలో ఉన్నారు. బాల్ బాడ్మింటన్ క్రీడలు లీగ్ దశలో కొనసాగుతున్నాయని టీఎస్ ట్రాన్స్‌కో క్రీడల అధికారి జగన్నాథ్ తెలిపారు. క్రీడా పోటీల్లో తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్, ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ సంస్థ, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డ్, తమిళనాడు ఎలక్ట్రిసిటీ , ఉత్తర్‌ప్రదేశ్ పవర్ సెక్టార్ల నుంచి 12 జట్లు, 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కుమార్‌వడివేలు, వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి జాన్సన్, కౌన్సిల్ సభ్యులు పి రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు విజేతలు..

200 మీటర్ల రన్నింగ్
బాలాజీ (గోల్డ్) ఏపీ, దినేష్(సిల్వర్) తమిళనాడు, రాజేష్(బ్రాంజ్) కేరళ.

800 మీటర్ల రన్నింగ్ ..
నాగులు(గోల్డ్) ఏపీ, సుందర్(సిల్వర్) తమిళనాడు, బాబు(బ్రాంజ్) తమిళనాడు.

400 మీటర్ల హర్డిల్స్
బాలమురుగన్(గోల్డ్) తమిళనాడు, యువరాజ్(సిల్వర్) తమిళనాడు, సతీష్(బ్రాంజ్)ఏపీ.

హ్యామర్‌త్రో
పాండ్యన్(గోల్డ్) తమిళనాడు, విజయ్‌కుమార్ (సిల్వర్) ఉత్తర్‌ప్రదేశ్, శ్రవణ్‌కుమార్ (బ్రాంజ్) ఉత్తర్‌ప్రదేశ్.

షాట్‌పుట్
శ్రీనివాస్(గోల్డ్) ఏపీ, రాజేశ్‌కుమార్(సిల్వర్) కేరళ, ముఖేష్(బ్రాంజ్) తమిళనాడు.

లాంగ్‌జంప్
రాజేష్(గోల్డ్) కేరళ, దినేష్(సిల్వర్) తెలంగాణ, విజయ్‌కుమార్(బ్రాంజ్) తమిళనాడు.

ఉద్యమకారులకు సముచిత స్థానమివ్వాలి

- ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్వీ విద్యార్థి ఉద్యమ నేతల డిమాండ్


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్వీ విద్యార్థి ఉద్యమ నేతలు

కేయూ క్యాంపస్ : 'తెలంగాణ రాష్ట్ర సాధనలో అప్పటి టీఆర్ఎస్వీ, ఇప్పటి బీఆర్ఎస్వీ విద్యార్థి నేతలు కీలక పాత్ర పోషించి అనేక కేసుల పాలై జైళ్లకు వెళ్లాం.. కానీ రాష్ట్రం సాధించిన అనంతరం తమకు ఎలాంటి గుర్తింపు లభించడం లేదని, మాపై చిన్న చూపు ఎందుకంటూ' ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్వీ ఉద్యమ నేతలు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం కేయూలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చట్టసభలు, పదవులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ఎందులో కూడా కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి ఉద్యమ నేతలకు సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేటర్, జెడ్పీటీసీ, ఇతర జిల్లా స్థాయి పదవుల్లో కూడా అవకాశం కల్పించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ సేవలను గుర్తించి వివిధ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి ఉద్యమ నేతలు డాక్టర్ పాలకుల కొమురయ్య, కందుకూరి ప్రభాకర్, మాచర్ల శరత్‌చంద్ర, జెట్టి రాజేందర్, మేడారపు సుధాకర్, అరూరి రంజిత్, కె. అభినాష్, రాజీమనోజ్, నాగరాజు, నగేష్, లక్ష్మణ్‌గౌడ్, సుమన్‌రెడ్డి, మోటె చిరంజీవి, విష్ణువర్ధన్, సాయిళ్ల రాజు, నీల అశోక్, రమేష్, తిరుపతి, క్రాంతికుమార్, ఎన్. సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు



హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.వి.వేణుగోపాలచారి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లోకల్ కోర్టు నిర్వహిస్తామని, వినియోగదారులు ఈ కోర్టులో ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 4న తొర్రూరు డివిజన్ నెల్లికుదురు సెక్షన్ కార్యాలయంలో లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో దంతాలపల్లి, మునగలవీడు, నెల్లికుదురు సెక్షన్ కార్యాలయ పరిధిలోని వినియోగదారులు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈ నెల 5న లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో అలంఖానీపేట, చెన్నారావు పేట, నెక్కొండ సెక్షన్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు ఫిర్యాదు చేయొచ్చని తెలి పారు. ఈ నెల 12న ములుగు డివిజన్ వాజేడు సబ్ స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టు ద్వారా ఎస్.వి.పురం, వాజేడు, ఈ నెల 13న జనగామ డివిజన్ రఘునాథపల్లి సబ్ స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో నర్మెట, ఖిలాషాపూర్, రఘునాథపల్లి, తరిగొప్పుల సెక్షన్ కార్యాలయాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులు అందించి సమస్యలు పరిష్కరించుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.వి.వేణుగోపాలచారి కోరారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికలు


రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపిక చేస్తున్న అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథం (ఎన్ఎస్ఎస్) కార్యాలయంలో మంగళవారం ప్రీ రిపబ్లిక్ పరేడ్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు హైదరాబాద్ నుంచి ఎన్ఎస్ఎస్ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ, స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీస్ డిప్యూటీ ఎస్‌వో గీత, మరో అధికారి సంజయ్ హాజరయ్యారు. ప్రీ పరేడ్‌కు యూనివర్సిటీ పరిధిలోని వివిధ జిల్లాలకు చెందిన కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లలో ఐదుగురు బాలికలను ఎంపిక చేసినట్లు కేయూ ఎన్ఎస్ఎస్‌కోఆర్డినేటర్ ఈసం నారాయణ తెలిపారు. వీరు వచ్చే ఏడాది జనవరి 26న న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొంటారని తెలిపారు.

కబ్జాపై కదిలిన యంత్రాంగం..

- భూమి చుట్టూ కంచె ఏర్పాటుకు నిర్ణయం
- కబ్జాదారులపై క్రిమినల్ చర్యలకు రంగం సిద్ధం

సాక్షి ఎఫెక్ట్..


కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న సొసైటీ అధికారులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భూమి కబ్జా అంశాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణించారు.'సర్కార్ భూమి స్వాహా' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఇందుకు సొసైటీ అధికారులు స్పందించారు.ఈ మేరకు మంగళవారం జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ మేరకు భూమి కబ్జాకు గురైందని చైర్మన్ రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. 2022 జనవరిలో రెండెకరాల భూమిని సొసైటీకి కేటాయించిన పత్రాలను అధికారులకు చూపించారు. కొంతమంది కబ్జాదారులు సొసైటీ భూమిలోకి ఆక్రమించారని వివరించారు. బడా లీడర్ల హస్తంతో భూమి కబ్జాకు గురైనట్లు స్థానికులు అధికారులకు చెప్పారు.

భూమి చుట్టూ కంచె ఏర్పాటు

కాగా,సొసైటీకి కేటాయించిన రెండెకరాల భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు పాలక వర్గానికి సూచించారు. సొసైటీ నిధులు వెచ్చించాలని చెప్పారు. ఇదిలా ఉండగా, కబ్జాదారులపై క్రిమినల్ చర్యలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేసన్‌లో ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండాలి

- దేవాదాయధర్మాదాయశాఖ వరంగల్ జోన్ ఉపకమిషనర్ శ్రీకాంతారావు
- ముగిసిన డీడీఎన్ అర్చకుల శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్ : అర్చకులు గ్రామరాజకీయాలకు దూరంగా ఉంటూ వేదధర్మం అనుసరిస్తూ ముందుకు సాగాలని, సిబ్బందితో ప్రతి మండలం, గ్రామంలో వెరిఫికేషన్ బృందాలు ఏర్పాటు చేస్తామని దేవాదాయశాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ టి. శ్రీకాంతారావు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల దూపదీప నైవేద్య (డీడీఎన్)అర్చకులకు ఏర్పాటు చేసిన పునశ్చరణ తరగతులు ముగిశాయి. తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన ముగింపు సమావేశంలో శ్రీకాంతారావు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో డీడీఎన్ అర్చకులు దేవాలయాల తాళాలు తీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్చకులు రోజూ ఉదయం వారి దేవాలయాల నుంచి లోకేషన్ షేర్ చేయాలని, దీనికోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వేదపండితుల ఆధ్వర్యంలో శైవ, వీరశైవ, స్మార్థ, పాంచరాత్ర, చాత్తాదవైష్ణవ, వైఖానస, గ్రామదేవత, తంత్రసార తదితర ఎనిమిది ఆగమాలలో అర్చకులకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్లు రామల సునీత, శేషుభారతి, సిబ్బంది వీరస్వామి, కవిత, సంజీవరెడ్డి, అనిల్‌కుమార్, అర్చక బోర్డు సభ్యులు చిలకమర్రి శ్రవణకుమార్‌చార్యులు, కృష్ణమాచారి, వేద పండితులు రామశర్మ, లంకాశివకుమార్‌శర్మ, పార్థసారథి, రత్నాకర్, రాఘవాచారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సతీష్(ఫైల్)

భూపాలపల్లి అర్బన్: ద్విచక్రవాహనం అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి వేశాలపల్లి గ్రామ సమీపంలో జరిగింది. వేశాలపల్లి గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసముంటున్న బైరి సతీష్ (34) సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై భూపాలపల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గ్రామ సమీపంలోని కల్వర్ట్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటపై మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు.

మిగిలిన సీట్ల కోసం వాక్‌ఇన్ అడ్మిషన్లు

వరంగల్ : రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ జుమ్లానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2023 సెషన్ కోసం ఎన్‌సీవీటీ పద్ధతిలో వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్లలో శిక్షణ పొందడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో నాలుగు విడతల్లో జరిగిన కౌన్సింగ్‌లో మిగిలిన సీట్ల కోసం 5వ విడత వాక్‌ఇన్ అడ్మిషన్ల కోసం www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ విడత వాక్‌ఇన్ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్‌కు ఈనెల 8 చివరి తేదీ అని తెలిపారు. ఆన్‌లైన్‌లో మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ వాక్ ఇన్ ఇంటర్వ్యూలను ఈనెల 9వ తేదీన ములుగు రోడ్డు సమీపంలో ప్రభుత్వ ఐటీఐ కాలేజీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.